క్లుప్తంగా

డ్రగ్స్‌కు బానిసలైతే జీవితాలు ఛిన్నాభిన్నం

ఎస్‌ఐ చల్లా సురేష్



నకరికల్లు: మాదకద్రవ్యాల వలన జీవితాలు ఛిన్నాభిన్నమవుతాయని ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు. మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలను వివరిస్తూ స్థానిక అక్షర పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి, మద్యం లాంటి మాదకద్రవ్యాల వలన శారీరక, మానసిక రుగ్మతలు ఏర్పడతాయన్నారు. జీవితంలో విషాదం నింపే డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. యుక్త వయస్సులో దురలవాట్లకు బానిసలు కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పాఠశాల బస్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనాలు నడిపే క్రమంలో క్రమంలో అప్రమత్తంగా ఉండాలని, అతివేగం ప్రమాదకరమని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడులో వేంచేసి ఉన్న అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో మాసశివరాత్రి వేడుకలు బుధవారం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో మాసశివరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలతో శాకంబరి దేవిగా అమ్మవారిని అలంకరించారు. గుండ్లపల్లి, నర్సింగపాడు గ్రామాల నుంచి మహిళాభక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. పలు గ్రామాల భక్తులు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. దీపార్చనలు చేసి పొంగళ్లు పొంగించారు. విశేష అలంకరణలో స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

రైతులకు నాణ్యమైన ఎరువులను విక్రయించాలి

ఏడీఏ మస్తానమ్మ



బెల్లంకొండ: దుకాణదారులు రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలని క్రోసూరు డివిజన్ ఏడీఏ మస్తానమ్మ సూచించారు. బుధవారం మండలంలోని పలు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి అరుణ కుమారితో కలిసి తనిఖీ చేశారు. నాణ్యతలేని విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత పురుగుమందుల విక్రయం నేరమని పేర్కొన్నారు. గ్రోమోర్ దుకాణంలో ఎరువుల నిల్వలు తనిఖీ చేశారు. ఫారమ్ ఓ ఇంక్లూషన్ లేని రూ.27,61,413 విలువ గల 18,259 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలను నిలిపివేశారు. తదుపరి అనుమతులు వచ్చే వరకు ఆ ఎరువులను విక్రయించవద్దని సూచించారు.

డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ



ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్ళ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగీ వ్యాధిపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్ పాల్గొని వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి తొట్టెలలో నీరు నిల్వ ఉండకుండా శుభ్రపరచుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి జయకృష్ణప్రవీణ్ మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, ఒళ్లునొప్పులు, ఆకలిలేకపోవటం, చర్మంపై దద్దుర్లు ఉంటే డెంగీ వ్యాధిగా అనుమానించాల్సి ఉంటుందని, వెంటనే చికిత్స అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ దస్తగిరి, సూపర్‌వైజర్లు ఎ.పీటర్‌డేమియన్, సీనియర్ అసిస్టెంట్ ఉస్మాన్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్కరాజుగార్లపాడు ఎస్సీ కాలనీలో మట్టి రోడ్డు దుస్థితి



కాలువ నుంచి రోడ్డు పైకి వస్తున్న మురుగునీరు

చినుకు పడితే.. జారిపోవడమే..

సత్తెనపల్లి: అంతర్గత మట్టి రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు ఎస్సీ కాలనీలో వర్షానికి మట్టి రోడ్డు కాస్త బురద మయంగా మారి రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కనీస మరమ్మతులు కూడా లేకపోవడంతో మట్టి రోడ్డుపై బురదలోనే జారుకుంటూ నానా అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే రోడ్డంతా బురద మయంగా మారుతుండడంతో నడిచేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. అంతేకాక వర్షం పడితే కాలువలోని మురుగునీరు రోడ్డుపై పారుతుండడంతో మరింత ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డు వేయాలని ఎస్సీ కాలనీవాసులు కోరుతున్నారు.

అందని రుణాలు.. వర్తించని పథకాలు

- లక్ష్య దూరంగా కౌలు కార్డుల జారీ
- ఇబ్బందులు పడుతున్న కౌలు రైతులు



పత్తి చేలో అంతరకృషి చేస్తున్న కౌలు రైతు

అమరావతి: కౌలు రైతులకు అటు పంట రుణాలు, ఇటు ప్రభుత్వ పథకాలు అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. పంట సాగుదారు హక్కు పత్రాలు జారీలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అలాగే కౌలు రైతులు కూడా పెద్దగా ఆసక్తి చూపటం లేదు. దీంతో కౌలు కార్డుల జారీ ప్రక్రియ నత్తనడకన సాగుతుంది.

నియోజవర్గంలో ఇలా...

పెదకూరపాడు నియోజవర్గంలోని ఐదు మండలాల్లో సీసీఆర్‌సీ కార్డుల జారీ ప్రస్తుతానికి లక్ష్య దూరంగా సాగుతుంది. నియోజకవర్గంలో మండలాల్లో సుమారు 11,179 సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేయాలనేది లక్ష్యంగా పెట్టుకుని మే నెల నుంచి రెవెన్యూ, వ్యవసాయ శాఖలు పనిచేస్తున్నాయి. ఈ క్రమంలో నియోజకవర్గంలో 11,179 కార్డులకు గాను ఇప్పటివరకు సుమారు 2,036 కార్డులు మాత్రమే పంపిణీ చేసినట్లు సమాచారం. అదే విధంగా మండలాల వారీగా అమరావతి మండలంలో 2,400 కార్డుల లక్ష్యం కాగా 701 కార్డులు పంపిణీ చేశారు. అలాగే పెదకూరపాడు మండలంలో 2,200కు గాను 268, క్రోసూరు మండలంలో 2,434కు గాను 270, అచ్చంపేట మండలంలో 2,800కు గాను 552, బెల్లంకొండ మండలంలో 1,345 కార్డుల లక్ష్యం కాగా 245 జారీ చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు మండలంలోని భూ యజమానులకు, కౌలు రైతులకు అవగాహన కల్పించి కౌలు రైతులందరికీ సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేసి తద్వారా పంట రుణాలు, వివిధ ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకు వర్తించేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

గ్రూపులోన్లు ఇచ్చినా అప్పు తప్పదు



వ్యవసాయ ఖర్చులు పెరిగిపోవటంతో రైతులకు ప్రైవేటు అప్పులు తీసుకోవటం అలవాటైంది. పోయి నేడు తెగుళ్లు ఎక్కువగా ఆశించటం, గిట్టుబాటు ధర లేకపోవటం వల్ల నష్టాలు వచ్చాయి. ఈ ఏడాదైనా కౌలు రైతులకు పంట రుణాలిస్తారేమోనని ఆశగా ఎదురుచూస్తున్నాం. గతంలోలాగా గ్రూపులోన్లు ఇచ్చినా పెట్టుబడికి సరిపోక మరలా పెచ్చు వడ్డీకి అప్పులు తేక తప్పదు.

– జెట్టి నాగరాజు, కౌలు రైతు, జూపూడి

రుణాలు ఇవ్వటం లేదు



ఈ ఏడాది కూడా 7 ఎకరాలు తీసుకుని అందులో 4 ఎకరాలు పత్తి వేశాను. మరో 3 ఎకరాలలో మిర్చి సాగు చేద్దామనుకుంటున్నాను. ఈ ఏడాది కూడా కౌలు రైతు కార్డు కోసం 20 రోజుల క్రితం అప్లికేషన్ పెట్టాను. గతేడాది పత్తి, మిర్చిలో నష్టాలు వచ్చి చేసిన అప్పులు తీరలేదు. కౌలు రైతులకు బ్యాంకులలో రుణాలు ఇవ్వటం లేదు. ఇక ఎక్కువ వడ్డీకి అప్పులు తెచ్చి సాగు చేయాల్సిందే. కౌలు రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది.

– కోరంపల్లి సూరిబాబు, కౌలురైతు, ధరణికోట

ప్రయత్నం చేస్తున్నాం

మండలంలో అన్ని బ్యాంకుల మేనేజర్లతో సంప్రదింపులు జరిపి కౌలు రైతులకు రుణాలిప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. గతేడాది జాయింట్ లయబిలిటీ గ్రూపులకు, రైతు మిత్ర గ్రూపులలో కౌలు రైతులకు రూ.75 లక్షల రుణాలను ఇప్పించాం. ఈ ఏడాది కూడా బ్యాంకుల విధివిధానాలకు లోబడి కౌలు రైతులకు రుణాలిప్పిచ్చేందుకు కృషి చేస్తాం. కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు మంజూరు చేస్తున్నాం.

– ఎస్‌కేఎఫ్ అహ్మద్, ఏవో, అమరావతి

జాతీయ స్థాయిలో సత్తా చాటిన కేంద్రీయ విద్యార్థినులు



విద్యార్థినులు, పీఈటీ కిరణ్‌రెడ్డిని అభినందించిన ప్రిన్సిపాల్ జగదీశ్‌కుమార్ గుప్తా

సత్తెనపల్లి: పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో జరిగిన 54వ జాతీయ స్థాయి వాలీబాల్ అండర్–17 బాలికల పోటీలలో సత్తెనపల్లి పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ విద్యార్థినులు రన్నర్ అప్‌గా నిలిచారు. హైదరాబాద్‌లో జరిగిన సెలక్షన్ క్యాంప్‌లో సత్తెనపల్లి పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం నుంచి స్వీటీబాయ్, ఎస్.శ్రీలక్ష్మి, బి.సరోజిని, జెస్సీ ఇషిత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 3 నుంచి 18వ తేదీ వరకు జరిగిన ట్రైనింగ్ క్యాంప్‌లో వీరు మెళకువలు నేర్చుకుని ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరిగిన 54వ జాతీయ స్థాయి పోటీలలో రన్నర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పీఈటీ బి.కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్‌లో జరిగిన రీజనల్ వాలీబాల్ మీట్‌లో సత్తెనపల్లి జట్టు రన్నర్‌గా నిలిచిందన్నారు. ప్రిన్సిపాల్ జగదీశ్ కుమార్ గుప్తా విద్యార్థినుల అభివృద్ధికి కృషి చేసిన పీఈటీ కిరణ్‌రెడ్డిని అభినందించారు. ఖమ్మంలో జరిగిన ట్రైనింగ్ క్యాంపుకి కిరణ్ రెడ్డి శిక్షణ నిపుణులుగా వెళ్లడం ఎంతో గర్వకారణమన్నారు. జాతీయ స్థాయిలో రన్నర్ అప్‌గా నిలిచిన సతెనపల్లి విద్యార్థినులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

వెళ్లే దారి లేక... రోడ్డు పైనే...



సత్తెనపల్లి: చిన్నపాటి వర్షానికి పట్టణంలోని పలు రహదారులపై నీరు నిలుస్తుంది. రెండు రోజుల పాటు కురిసిన వర్షానికి పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరి తెలుగు బాప్టిస్ట్ చర్చి వెనుక ఏరియా సమీపంలో రహదారిపై నీరు నిలిచింది. ఈ ప్రాంతంలో కాలువలు లేకపోవడంతో నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి. రోడ్డుపై నీరు చేరడంతో వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

రైతులకు విత్తనాలు, డ్రోను పంపిణీ



రైతులకు డ్రోను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు : మండలంలోని బలుసుపాడు గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బుధవారం రైతులకు రాయితీపై విత్తనాలు, డ్రోను అందజేశారు. అనంతరం రూ.30 లక్షలతో డొంక రోడ్డు నిర్మాణానికి, రూ.20 లక్షలతో గ్రామంలో అంతర్గత రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన పనులను ప్రజలకు వివరించారు. టీడీపీ సీనియర్ నాయకులు సాంబశివరెడ్డి, మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య, రమేష్, ముంతాజ్, అప్పారావు, బాలయ్య స్థానిక నేతలు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల మధ్య తోపులాట

సత్తెనపల్లి: టీడీపీ శ్రేణుల మధ్య తోపులాట జరిగిన సంఘటన పట్టణంలోని 24వ వార్డులో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం 24వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరు కావడానికి ముందు అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద వివాదం నెలకొంది. ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతూ స్థానిక నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీ పెట్టగా మొదటి లైన్‌లో ఫొటోలు ఉన్న నేతలను ఉద్దేశించి టీడీపీ పట్టణ ట్రెజరర్ దేవతి శివప్రసాద్ వివాదాస్పద కామెంట్స్ చేశాడు. అక్కడే ఉన్న ప్రభుత్వ ఏరియా వైద్యశాల డైరెక్టర్ మారెళ్ళ స్వామి స్పందించి ఏమిటి నువ్వు చేసే కామెంట్ అంటూ ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి తోపులాటకు దారి తీసింది. దీంతో టీడీపీ నాయకులు అప్రమత్తమై ఇరువురినీ విడ దీశారు. కొద్దిసేపటికి ఎమ్మెల్యే రావడంతో కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ తోపులాట పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

మోసానికి మారుపేరు చంద్రబాబు



క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల తదితరులు

వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి

నకరికల్లు: మోసం అంటే చంద్రబాబు, నమ్మకం అంటే జగన్ ప్రజలకు గుర్తుకొస్తారని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియాను పావుగా వాడుకుంటూ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ ఎలా జరిగిందో.. ప్రజలు నమ్మి ఎంత మోసపోయారో గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. తల్లికి వందనం పేరుతో చదువుకుంటున్న బిడ్డల తల్లులను మోసం చేశారని అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించాలను. క్యూఆర్ కోడ్‌తో కూడిన చంద్రబాబు మోసపూరిత మేనిఫెస్టో కరపత్రాలు విడుదల చేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు చేసిన మోసాలను అంకెలతో సహా వీడియో రూపంలో వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల బాషా, ఎంపీటీసీ సభ్యులు అంజిరెడ్డి, కోటిరెడ్డి, సలీల్, మాజీ సొసైటీ అధ్యక్షుడు దొండేటి కోటిరెడ్డి, కంతమనేని చందు, అలపర్తి భాస్కరరావు, గుత్తికొండ నన్నేసా, మద్దం సురేష్, పాలూరి రాజశేఖర్‌రెడ్డి, శాగం చంద్రశేఖర్ రెడ్డి, కోనంకి ఆదినారాయణ, కోవూరి నరసయ్య, అనిల్‌కుమార్, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో బుధవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందేలా వైద్యులు, అభివృద్ధి కమిటీ సభ్యులు చూడాలన్నారు. ఈ సందర్భంగా గైల్ స్వచ్ఛంద సంస్థ వైద్యశాలకు అందించిన పరికరాలు, ఫర్నిచర్‌ను పరిశీలించారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ స్కీం గురించి ఆరా తీశారు. అనంతరం పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌ను ఈ నెల 25న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రారంభోత్సవానికి విచ్చేయనున్న సందర్భంగా పరిశీలించారు. అలాగే రఘురామ్‌నగర్‌లోని తన కార్యాలయంలో 87 మందికి రూ.79.59 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలోని 24వ వార్డులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.6.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలలో ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్, పార్టీ నాయకుడు చౌటా శ్రీనివాసరావు, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ పోట్ల అరుణకుమారి, యెల్లినేడి లక్ష్మీతులసీ, జవ్వాజి రామ్మోహన్‌రావు, మారెళ్ళ స్వామి, శిరిగిరి మణికంఠ, వైద్యులు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

అనాథ చిన్నారులకు చేయూత

మాచర్ల: చిన్నారులకు స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చేయూత నిచ్చింది. వివరాలు.. పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దగ్గుల లక్ష్మీ కార్తీక రెడ్డి(12), అఖిల్ రెడ్డి(10) తల్లిదండ్రులు మృతి చెందారు. ట్రస్ట్ గోవిందరెడ్డి స్పందించి ఆ చిన్నారుల చదువు పూర్తయ్యేంతవరకు బాధ్యత తీసుకుంటున్నానని హామీ ఇచ్చారు.

కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందాలి

క్రోసూరు డివిజన్ ఏడీఏ మస్తానమ్మ



నందిరాజుపాలెంలో వరి నారుమడులను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో



ఎస్‌ఎఫ్‌ఎస్‌ఎం కింద కందులు పంపిణీ చేస్తున్న ఏవో సుబ్బారెడ్డి



పీసపాడులో రైతులకు సూచనలిస్తున్న ఏవో వేణుగోపాల్



పంటల బీమా కార్డులను ప్రదర్శిస్తున్న ఏవో దేవదాసు, రైతులు

బెల్లంకొండ: పొలాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులు కౌలు రైతు కార్డులను పొందాలని క్రోసూరు డివిజన్ ఏడీఏ మస్తానమ్మ తెలిపారు. బుధవారం మండలంలోని నందిరాజుపాలెం గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు త్వరితగతిన రైతు సేవ కేంద్రాలకు వెళ్లి కౌలు కార్డులతో పాటు పంటల బీమా పథకానికి నమోదు చేయించుకోవాలని సూచించారు. కంది, మిర్చి పంటలకు జూలై 31వ తేదీ వరకు, వరి పంటకు ఆగస్టు 15 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. రైతులతో కలిసి నారుమడులను పరిశీలించి సూచనలు ఇచ్చారు. రైతు సేవ కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించి, రైతులకు త్వరితగతిన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో అరుణకుమారి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

నకరికల్లు: కౌలు రైతులు వీఆర్వోలను సంప్రదించి సీసీఆర్‌సీ కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని నకరికల్లు, శివాపురంతండా గ్రామాల్లో బుధవార పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ నమోదు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పెంచినట్లు తెలిపారు. ఒక ఎకరం పత్తి పంట బీమా ప్రీమియం రైతు వాటాగా రూ.1,900 చెల్లించాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో కంది, మిర్చి పంటలకు జూలై ఆఖరులోగా ప్రీమియం చెల్లించాలన్నారు. వరి పంటకు ఆగస్టు 15లోగా ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు వై.ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి

సత్తెనపల్లి: ఖరీఫ్ పంటలు సాగు చేసే రైతులు పంటల బీమా చేయించుకోవాలని సత్తెనపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని బృగుబండ, కందులవారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఏఐసీ) ద్వారా కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతో పంట నష్టం నుంచి రైతులను ఆదుకొనుటకు 'పునర్వ్యవస్థీకరింపబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం' కింద ఖరీఫ్–2025 సీజన్‌లో పత్తి పంటను సాగు చేసే రైతులు ఎకరాకు ప్రీమియం రూ.1,900 చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. ఒకవేళ పంట నష్టం కలిగినట్లయితే బీమా మొత్తం రూ.38 వేలు పొందవచ్చన్నారు. పత్తికి ఈ నెల 31 వరకు, వరికి ఆగస్టు 15 లోపు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. పప్పు ధాన్యాలకు ప్రీమియం ఎకరాకు రూ.40 చెల్లించినచో బీమా మొత్తం రూ.20 వేలు పొందవచ్చన్నారు. మిర్చికి ఎకరాకు రూ.360 చెల్లించినచో బీమా మొత్తం రూ.90 వేలు పొందవచ్చన్నారు. వరికి రూ.80 చెల్లించినచో రూ.40 వేలు పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఎస్‌ఎం కింద కందులు, మినుములు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో జానీబాషా, వీహెచ్‌ఏ ఎస్.జీవనజ్యోతి, మల్లారెడ్డి, బూతుకురి కోటిరెడ్డి, అన్నదాసు వెంకట రామయ్య, రైతులు పాల్గొన్నారు.

పత్తి సస్యరక్షణ చర్యలపై అవగాహన

క్రోసూరు: మండలంలోని పీసపాడు, ఉయ్యందన గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం ఏవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో సాగులో ఉన్న పత్తి పంటను రైతులతో కలిసి పరిశీలించి ఆయన తగు సూచనలు ఇచ్చారు. వర్షాలు ఎడతెరిపి లేకుండా పడుతూ, చేలల్లో నీరు నిలిచినట్లయితే, ఆ నీటిని వీలైనంత త్వరగా తీసివేయాలన్నారు. పైరు పెరుగుదలకు దోహదపడే విధంగా ఎరువులను బూస్టర్ డోస్‌గా వేసుకోవాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే వీలైనంత త్వరగా మొక్కల మధ్య అంతర సేద్యం చేయడం వలన తేమ ఆరిపోయి, మొక్కలు త్వరగా కోలుకుంటాయని తెలిపారు. వాతావరణంలో అధిక తేమ ఉండడం వల్ల, తెగుళ్ల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున, లీటర్ నీటికి ప్రాపికొనజోల్ 1మి.లీ (లేదా) కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3గ్రాముల చొప్పున పిచికారి చేసుకోసుకోవాలని సూచించారు. వర్షాలు పడుతున్నందువల్ల కలుపు సమస్యను అధిగమించడానికి తగిన చర్యలు చేపట్టాలనలి సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో ఎ.రామచంద్రరావు, రైతు సేవా కేంద్ర సిబ్బంది వి.సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో లాం ఫామ్ శాస్త్రవేత్త నగేష్ పాల్గొని వరిలో విత్తన రకాలు, పంట కాలంలో పంటకు ఆశించే తెగుళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారి బీవీ నారాయణ మాట్లాడుతూ బీపీటీ 5204 రకం అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, 25 కేజీల బ్యాగ్ విలువ సబ్సిడీ రూ.125 పోను రైతు రూ.950 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కౌలు రైతులు సాగుదారు పత్రాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది నరేష్, రైతులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు పత్తి పంటకు ప్రీమియం చెల్లించాలి

రాజుపాలెం: మండలంలోని మొక్కపాడు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో పి.వెంకటనర్సయ్య మాట్లాడుతూ ప్రతి రైతు పంటల బీమా ప్రీమియం చెల్లించినట్లయితే వాతావరణ పరిస్థితుల ఆధారంగా పంట నష్టం, దిగుబడి తగ్గినట్లయితే పంటల బీమా పొందవచ్చని తెలిపారు. పత్తి పంటకు ప్రీమియం చెల్లించుటకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు హేమంత్, కణదం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.